క్లుప్తంగా

మావుళ్లమ్మ సేవలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులకు అమ్మవారి మెమెంటో అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ముఖ్య అర్చకుడు కొప్పేశ్వరరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తల మండలి సభ్యురాలు తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామక్షేత్రంలో పూజలు



ఉండి శ్రీరామక్షేత్రంలో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఉండిలోని శ్రీరామక్షేత్రంలో ఆదివారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థాపకుడు అళగిరి అప్పల నర్సింహం మూడో తరానికి చెందిన అళగిరి ఆనంద్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలను అందించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు, రాయి సతీష్, శేషాద్రి శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆలయాన్ని సందర్శించి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి బుజ్జి, కావలి నాని, చిట్టూరి కృష్ణ,అర్బన్‌బ్యాంకు చైర్మన్ ద్వారా హేమకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా భాగవత సప్తాహ మహోత్సవాలు



రాజగోపాలస్వామి ఆలయంలో మురళీకోలాటం చేస్తున్న చిన్నారులు

నరసాపురం రూరల్: మొగల్తూరులో ఉన్న శ్రీరాజగోపాల స్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన మురళీ కోలాటం అందరినీ అలరించింది. ఆలయంలో జరుగుతున్న భాగవత సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం హరే శ్రీనివాస భజనమండలి ఆధ్వర్యంలో మురళీ కోలాట నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు భక్తి గీతాలతో చేసిన ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. హరే శ్రీనివాస భజన మండల గురువు పరాయతం నారాయణాచార్యులు, నల్లాని చక్రవర్తుల వాసుదేవ ఫణి, పులపర్తి రాజు తదితరుల ఆధ్వర్యంలో చిన్న పిల్ల కోలాటం నిర్వహించారు.

నరసాపురంలో శాకాహార ర్యాలీ

నరసాపురం రూరల్: పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. నరసాపురం పట్టణానికి చెందిన పలువురు ధ్యానులు శాత్వికమైన ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పుర వీధుల్లో నినాదాలు చేశారు. మాస్టర్ భారతి శాఖాహార ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు పాడారు. సుభాష్ పత్రీజీ చెప్పిన శ్వాసమీద ధ్యాస ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించడం సాధ్యపడుతుందని పాట రూపంలో వివరించారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సేవలు భేష్

- పార్టీ ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- పెదఅమిరంలో సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశం



సోషల్ మీడియా కార్యకర్తలతో శ్రీ లక్ష్మి, పీవీఎల్

కాళ్ల: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నిస్వార్థంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని పార్టీ ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెద అమిరంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి విచ్చేసిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా, ఎటువంటి కేసులకు భయపడకుండా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నిస్వార్థంగా పార్టీకి సేవలు అందిస్తున్నారన్నారు. కానీ టీడీపీ, జనసేన పార్టీలు సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టి కలుషితం చేస్తున్నారన్నారు. ఫేస్‌బుక్‌లో పార్టీ వాళ్లతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఉంటారని, అందువల్ల సోషల్ మీడియాలో పెట్టే కామెంట్లు సంస్కారవంతంగా ఉండాలని సూచించారు. దీంతో పార్టీ పోస్టులను ఎంతో మంది చూస్తారని, ఈ పోస్టుల వల్ల మనపై గౌరవం పెంచుకుంటారన్నారు. పార్టీ నేతలను రెచ్చగొట్టి వారితో తప్పులు చేయించడానికి టీడీపీ, జనసేన పార్టీలు చూస్తున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమంతో పాటు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో పీవీఎల్ నర్సింహరాజు ఓటమిపాలైనప్పటికీ నిరంతరం ప్రజల వెంట ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారని కొనియాడారు. ఆయన ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించుకునేలా సోషల్ మీడియా కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ఖండించారు. పురందేశ్వరి బీజేపీ అధ్యక్షురాలిగా ఉంటూ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సోషల్ మీడియా కార్యకర్తలు ఉత్సాహంగా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఉండి నియోజకవర్గంలో గెలుపొందితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానం ఇస్తారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు సోషల్ మీడియా ద్వారా దీటుగా సమాధానం ఇస్తోందని సోషల్ మీడియా కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గణేష్న రాంబాబు, నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భీమవరం అర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరడంతో పాటు దేహ ధారుడ్యం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల జీసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, ఎల్‌జీపాడు సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యుడు తిరుమాని ధనంజయరాజు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. దిరుసుమర్రులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చెడుగుడు పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంప్రదాయ క్రీడ చెడుగుడు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాలలో ఇటువంటి క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించవచ్చన్నారు. ఎంతోమంది గ్రామీణ క్రీడాకారులు గ్రామ స్థాయిలో రాణించి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు తీసుకువచ్చారని గుర్తు చేశారు. నామన మహేష్, సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్, అల్లూరి చిరంజీవి రాజు, శ్యాముయేలు రాజు, తోకల కామరాజు, గూడనాటి కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్పంతో మహా సంక్షేమం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తి
- నేడు ఆకివీడులో సేవా కార్యక్రమాలు



పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: ప్రజా సంకల్ప పాదయాత్రతో మహా సంక్షేమం పుట్టుకు వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తి చేసుకుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభించి ఆరు సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేసిన ప్రతి అడుగూ గడపగడపలో సంక్షేమాన్ని నింపుతోందని చెప్పారు. సంక్షేమాభివృద్ధితో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయన్నారు. వారి జీవన విధానంలో మార్పులు వచ్చాయన్నారు. అణగారిన, ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాలతో పాటు ఇతర సామాజిక వర్గాల్లోని ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం పొందుతున్నారని చెప్పారు. సామాజిక సాధికారితతో పరిపాలన కొనసాగుతోందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయని పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. పేదవాడి పిల్లలు ఆంగ్ల విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. మాతృ భాషతో పాటు ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యతనిస్తూ సర్కారు బడుల్లో నూతన ఒరవడి తీసుకువచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదల్లో కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు పుట్టుకువస్తున్నారని పీవీఎల్ చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్యరంగం రాష్ట్రంలో రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. పేదవాడికి అందని ద్రాక్షగా వైద్యం ఉండకూడదని, ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి ఎన్నో పథకాల్ని అమలుజేసి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఆరోగ్య సురక్ష పేదవాడి ప్రాణానికి రక్షణగా నిలిచిందన్నారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కరోనాలోనూ, తరువాత కూడా ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా ఉచిత బియ్యం అందజేస్తున్నారని చెప్పారు. వ్యవసాయం దండగ కాదు పండుగ అని చాటి చెప్పి అమలుజేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆకివీడులోని వైఎస్సార్ సెంటర్‌లో దివంగత నేత రాజశేఖరెడ్డి విగ్రహం వద్ద సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

పాలకొల్లులో చాంబర్ కృషి అభినందనీయం



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోపిని సత్కరిస్తున్న వర్తక ప్రముఖులు

పాలకొల్లు అర్బన్: చాంబర్ ఆఫ్ కామర్స్ వర్తకుల వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవా భావంతో పాలకొల్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రశంసించారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవనంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, దెందులూరి పార్టీ పరిశీలకులు యడ్ల తాతాజీలను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ తాను పాలకొల్లు ప్రజలకు సేవలు చేయడానికి వచ్చానని, తన సేవలపై సంతృప్తి చెందితేనే తనకు ఓటు వేయాలని కోరారు. అలాగే పాలకొల్లు వర్తకులకు ఏ సమయంలో ఏ అవసరం ఉన్నా తక్షణం స్పందిస్తానని హామీ ఇచ్చారు. కుళాయి చెరువు గట్టును ఆనుకుని ఉన్న లీకేజీ బోదెలోకి పబ్లిక్ ట్యాంకర్లతో మలాన్ని వదిలేస్తున్నారని, కులాయి చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్న ప్రజలు దుర్వాసన భరించలేక పోతున్నారని గుడాల గోపి దృష్టికి వర్తకులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి తక్షణం పబ్లిక్ ట్యాంకర్లను అక్కడ నుంచి తొలగించి ఆ ప్రాంతంలో ముగ్గు, బ్లీచింగ్ చల్లించాలని మునిసిపల్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు, కార్యదర్శి దేవరపు లక్ష్మీనారాయణ, కోశాధికారి నెలకుర్తి వెంకట సత్యానారాయణ, గౌరవ సలహాదారులు వేగేశ్న రంగరాజు, గుణ్ణం సర్వారావు, కార్యదర్శి మామిడి వెంకటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షుడు రేపూరి సూర్యనారాయణ, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాల పరిశీలన



మహదేవపట్నంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఉండి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించిందని తహసీల్దార్ యేడిద శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ ఎస్వీఎస్ నాయుడు ఆదివారం చెప్పారు. మండలంలోని 54 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కొత్తగా ఓటు హక్కు కొరకు 853 మంది దరఖాస్తు చేసుకోగా మరణాలు, డబుల్ ఎంట్రీల తొలగింపు కొరకు ఫారం-7 ద్వారా 476 మంది, మార్పులు చేర్పుల కొరకు 925 మంది దరఖాస్తు చేశారన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా, ఉణుదుర్రులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు జి.సుందర్‌కుమార్ ఓటరు జాబితాను పరిశీలించి పలువురికి సూచనలు, సలహాలు అందించారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల పేటతుళ్లి



నరసాపురంలో పేటతుళ్లి నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలోని పార్కురోడ్డులోని అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, కుమారస్వామి వేషధారణలతో పాటు విచిత్ర వేషధారణలతో మెయిన్‌రోడ్డు, వలందర్‌రేవు, లలితాంబరేవు, స్టీమర్‌రోడ్డు, శ్రీలక్ష్మి సెంటర్ ప్రాంతాల్లో పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు సుమారు 130 మంది పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ కోలాటం, నిర్వహిస్తూ అయ్యప్ప నామాన్ని కీర్తిస్తూ భజనలు చేశారు. తొలుత పార్కు రోడ్డు సాయిబాబా ఆలయం వద్దనున్న అయ్యప్ప పీఠం నుంచి ప్రారంభమైన ఈ పేటతుళ్లి కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ నిర్వహించారు. అనంతరం రాత్రి భజనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు ద్వారా రాము, జనార్ధనస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో విజేతలు వీరే

సాక్షి, భీమవరం: పట్టణంలో బాలోత్సవం సందర్భంగా బాలోత్సం కమిటీ-ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్, డ్రాయింగ్ టీచర్స్ అసోసియేషన్, ఉదయ్ ఆర్ట్ గ్యాలరీ, పాలకొల్లు మానవత సంస్థ సహకారంతో నిర్వహించిన అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖన పోటీల్లో విజేతలను వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం వెల్లడించారు. సబ్ జూనియర్స్ విభాగంలో టి.జశ్వంత్‌సాయి, సి.రోహిత్, ఎం.లిఖిత్ వెంకట్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకోగా కె.నాగసాయి, ఎం.అషీర్‌వర్మ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారు. జూనియర్స్ విభాగంలో ఎం.ప్రణతి, ఎం.యజ్ఞసూర్యపవన్‌కార్తీకేయ, కొండవీటి కోటేశ్వర జోషిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ఎం.యక్షిత, కె.జయనందన్ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారు. సీనియర్స్ విభాగంలో ఎం.లోకేష్, ఎం.హాసిని, డి.లోహిత్‌శ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మేకా నాగసాయి లక్ష్మీప్రసన్న, ఎండీ రోషిణి, వి.ప్రభాకర్, కె.నిఖిత, సీహెచ్ ప్రణవి సాయిదుర్గ, ఎల్.దుర్గాప్రసన్న, వై.సాయిలాస్య, ఎం.సంజయ్, కె.దినేష్‌శ్రీ సాయితేజ కన్సోలేషన్స్ బహుమతులు గెల్చుకున్నారని ప్రసాదరాజు వివరించారు. ఈ పోటీల్లో 2,300 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ బహుమతులు అందచేసినట్లు చెప్పారు.

సంచార వైద్యశాల ద్వారా 10 మందికి పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 10 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి పది మంది నడవలేని వృద్ధుల ఇళ్లకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు జీజీ మూర్తి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో పేరుకున్న వ్యర్థాలతో అవస్థలు



ఉండి పంట కాల్వలో పేరుకుపోయిన ధర్మాకోల్, వ్యర్థాలు

ఆకివీడు: ఉండి పంట కాల్వ ధర్మాకోల్ వ్యర్థాలతో నిండిపోయింది. కాలువలో శివారు ప్రాంతంలోకి చెత్తా చెదారంతో పాటు ధర్మాకోల్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రుద్రయ్యకోడులోకి చొచ్చుకువచ్చే ఉండి పంట కాల్వలోని అదనపు నీటితో పాటు వ్యర్థాలు కొట్టుకురావడంతో ఆయా లాకుల వద్ద పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు వ్యర్థాల్ని, ధర్మాకోల్‌ను నెట్టి వేయడంతో శివారు ప్రాంతాలకు వచ్చి చిక్కుకుపోతున్నాయి. పాత పరుపులు, దుస్తులు, ఇతర మూటలు, ధర్మాకోల్, వ్యర్థాల వల్ల ఆకివీడులోని శివారు ప్రాంతానికి నీరందడంలేదని రైతులు వాపోతున్నారు. ఆయా ఐస్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే ధర్మాకోల్ వ్యర్థాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన



నరసాపురం రూరల్: ముత్యాలపల్లి హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం రూరల్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దీనిలో భాగంగా చేర్పులు, మార్పులతో పాటు డూప్లికేట్, చనిపోయిన వారి ఓట్లు తొలగించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా పరిశీలించి ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పక్కాగా తయారు చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్‌తో కలసి ఆదివారం ఆమె పరిశీలించి బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు పూర్తి బాధ్యత బీఎల్‌ఓలదేనని తెలిపారు. ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని పేర్ల సవరణ, చేర్పులు, మార్పులు అన్ని దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. జాబితాలో అక్కడక్కడా ఫొటోలు లేకుండా ఉన్న ఓటర్లను గమనించి ఫొటోలను తప్పకుండా అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. ఫారం-6, ఫారం-8లు ఎన్నెన్ని వచ్చాయి? ఎలా పరిష్కరించారు? అని కలెక్టర్ బీఎల్‌ఓలను ప్రశ్నించారు. స్పెషల్ క్యాంపెయిన్ తరువాత ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల క్రాస్ చెక్ చేసి చూడాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరినీ ఓటర్లుగా చేర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి కోరారు. ఆమె వెంట నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్, తహసీల్దార్ బి.అనిత కుమారి తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకూడదు

పాలకొల్లు అర్బన్: తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మండలంలోని దిగమర్రులోని పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను ఆదివారం ఆమె పరిశీలించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలింగ్ సమయంలో ఓటర్ల జాబితాలపై సమస్యలు తలెత్తితే బీఎల్‌ఓలు బాధ్యత వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ డా.ఎం అచ్యుత అంబరీస్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరు తమ ఓటును పరిశీలించుకోవాలి

యలమంచిలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గంలోని 191 పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శనకు ఉంచామని నియోజకవర్గ ఎన్నికల అధికారి కేసీహెచ్ అప్పారావు చెప్పారు. అడవిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ ప్రతీ ఓటరు తమ ఓటును సరిచూసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తమ పేరు లేకపోతే ఫారం 6, ఓటరు మరణించినతో ఫారం 7, పేర్లలో తప్పు ఉన్నా, చిరునామా మారినా ఫారం 8 దరఖాస్తులను డిసెంబర్ 9లోపు సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని కోరారు. డిసెంబర్ 27న ఓటర్ల జాబితా చివరి ప్రచురణకు పంపుతామన్నారు. జనవరి 5న కొత్త ఓటర్ల జాబితా ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎలక్షన్ డీటీ బ్రహ్మాజీ, బీఎల్‌వోలు కొల్లాటి నరేష్, త్సవటపల్లి మంజు, నారాయణ తదితరులు ఉన్నారు.

ఉండిలో 99.16 శాతం పింఛన్ల పంపిణీ

ఉండి: ఆరునూరైనా ప్రతి నెలా అందించాల్సిన పింఛన్ తగిన సమయానికి అందిస్తూ ఎందరో పింఛన్‌దారుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలో ఆదివారం ఇంకా మిగిలిన లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. అన్ని రకాల లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. మండలంలో 8,969 పింఛన్లు నవంబర్ నెలలో విడుదల కాగా, వాటిలో 8,889 పింఛన్‌లకు గాను ఆదివారం నాటికి రూ.2,40,67,250 నగదును 99.16 శాతం మేరకు పింపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

భీమవరం మండలంలో భారీ వర్షం

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పలువురు వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాలలో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం వల్ల దుబ్బు దశలో వరి చేలకు ఎంతగానో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

ధ్యానంతో శారీరక ఆరోగ్యం

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో కొణితివాడలో యరకరాజు అరుణ ఇంటివద్ద ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ నిర్వహించారు. కృష్ణా జిల్లా బొడ్డపాడుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.శివశంకరరావు పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ధ్యానం అంటే ఆలోచనా రహిత స్థితిలో ఉండటమన్నారు. ధ్యానం చేయడం వల్ల విశ్వశక్తిని పొంది నాడి మండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలన్నారు. ఆధ్యాత్మిక గీతాలవను రాగయుక్తంగా పాడి సామూహిక ధ్యానం చేయించారు. నాగరాజు సుబ్బరాజు తన ధ్యాన అనుభవాలను అందరితో పంచుకున్నారు. సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, కె.మోహన్, రామకృష్ణంరాజు, యరకరాజు అరుణ, భవాని ఉమావర్షిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సాక్షి, భీమవరం: మతి స్థిమితంలేని స్థితిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధురాలు చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గునుపూడికి చెందిన జవ్వాది గంగాభవాని (62)కి మతిస్థిమితం లేదు. ఈనెల 2న ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం రాత్రి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏఎస్‌ఐ ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ శ్రీను చెప్పారు.

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి వడలికి చెందిన చప్పారామస్వామి కుమార్తె, విజయవాడలో ఉంటున్న వేముల పల్లి విజయలక్ష్మీ దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విరాళాన్ని ఆలయార్చకులు రమణకు అందించారని, వీటిని అన్నదాన భవనం, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

సిద్ధాంతంలో ప్రజారక్షణ భేరి యాత్ర

పెనుగొండ: సీపీఎం ఆధ్వర్యంలో సిద్ధాంతంలో ఆదివారం ప్రజా రక్షణ భేరీ యాత్ర నిర్వహించారు. ఈ నెల 15న విజయవాడలో నిర్వహించబోయే ప్రజా రక్షణ భేరీకి అందరూ హాజరుకావాలని ప్రచారం నిర్వహించారు.